చెడు చేయటానికి రేటు మాట్లాడుకునే వాళ్ళ గురించి తెలుసుగాని మంచికి కూడా రేటు అడగటం అదే తొలిసారి కావటం ఆమెకి విచిత్రంగా అనిపించింది.

ఆమె సరాసరి కోర్టుకి వెళ్ళకుండా పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళింది డ్యూటీలోవున్న ఎస్.ఐ కి కంప్లయింట్ ఇచ్చింది.

"పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కే రక్షణ లేకుండా పోయింది పట్టణంలో. ఇక మామూలు సగటు మనుష్యులకు ఎలా రక్షణ కల్పిస్తారు? నాకు 24 గంటల్లో వాళ్ళను పట్టుకున్నట్లు వర్తమానం అందాలి. లేదంటే మీ పోలీస్ వ్యవస్థ అసమర్ధతని బంబాట్ చేయాల్సివస్తుంది మైండిట్?" అంటూ ఆవేశంగా బయటకు నడిచింది ఉత్కళ.

ఆ ఎస్.ఐ. ఆమె కమ్‌ప్లయింట్‌ను పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళటానికి భయపడ్డాడు.

అలా కాక వెంటనే తెలియపర్చివుంటే తాము వెదుకుతున్న ఉదయ్ అక్క ఆమే అని వెంటనే తెలిసివుండేది.

0 0 0

ఉష ఇంట్లోనుంచి బయటపడి వీధి చివరకేసి బయలుదేరింది.

ఆమే మనస్సునిండా ఈ మధ్య ఉదయ్‌కి సంబంధించిన ఆలోచనలే చోటు చేసుకున్నాయ్.

ఇదివరకు పావుగంట లేటయినా పెద్దగా కంగారుపడని ఉష ఇప్పుడు ఠంచనుగా రడీ అయిపోతుంది.

ఉదయం లేచిన దగ్గర్నుంచి ఆఫీసుకి బయలుదేరే వరకు సరిగ్గా సమయానికి ఉదయ్ వస్తాడా? తనకోసం ఎదురు చూస్తుంటాడా? అన్న ఆత్రమే ఆమెను నిలువనివ్వదు.

దూరం నుంచే ఉదయ్‌ని గుర్తించింది. ప్రతిరోజూ సరిగ్గా ఆ టైమ్‌కే, అక్కడే, వీధి స్తంభం క్రిందే నించుని వుంటాడు.

దగ్గరగా వస్తూనే ఉదయ్‌ని చూసి ఒకింత కంగారుపడింది. బట్టలన్నీ నలిగిపోయి తలంతా రేగిపోయి, అంతకుముందే ఎవరితోనో ముష్టి యుద్ధం చేసిన వాడిలా కనిపించాడు.

ఉషను చూస్తూనే అతను కదిలాడు.

కనీసం హలో అని గాని, గుడ్ మార్నింగ్ అని గాని, చిరునవ్వుతో పలకరించటం గాని ఎప్పుడూ తను చూడలేదు.

అతని దృష్టిని ఆకర్షించాలనో, అతని దృష్టిలో కనీసం పడితే చాలనో కాని తను ఈ మధ్య కొంచెం పొందికయిన బట్టలు కట్టుకోవడం, నీట్‌గా ముస్తాబు అవటం లాంటి విషయాలలో శ్రద్ధ తీసుకుంటుంది.

అది తనకి తెలీకుండా జరిగిపోతున్న విషయమని ఇటీవల తను గుర్తించింది.

తనను నిర్లక్ష్యం చేసే మగవాడి పట్లే స్త్రీ ఆకర్షణ పెంచుకుంటుందనే విషయం తన పట్ల

రుజువవుతుందేమో? ఆమె ఓ సారి తల విదిలించి ఉదయ్‌ని అనుసరించసాగింది.

అతను మౌనంగా ముందుకు సాగిపోతున్నాడు.

అతనలా మంచిచెడు లేకుండ మునిలా, నిశ్శబ్దంగా ముందుకు సాగిపోవటం ఆమెకు కోపాన్ని తెప్పించింది. క్రమంగా ఆ కోపం ఉక్రోషం క్రింద మారిపోయింది.

"ఏం మాట్లాడాలనిపించదా ఫ్రెండ్" ఆమె తనలో పెల్లుబికే ఉక్రోషాన్ని అణుచుకుంటూ అతనికి సమానంగా వస్తూ అడిగింది.

అతను మాట్లాడలేదు.

"నీ ప్రక్కన ఉంది మనిషే కాని మాను కాదు కదా?" అతనితో సమానంగా నడవాలంటే ఆమెకు కష్టంగా వుంది.

"నా డ్యూటి నిన్ను భౌతికంగా రక్షించడమే" అతను పొడిగా నిర్లిప్తంగా అన్నాడు.

హమ్మయ్య అదయినా మాట్లాడాడు చాలు అని మనస్సులో అనుకుంటూ.

"అఫ్‌కోర్స్... బట్ మనం మనుష్యులం. అందునా సంఘజీవులం. ఎవరిపని వారే ఖచ్చితంగా చేసుకోపోవటానికి మనం యంత్రాలం కాదు కదా?"

అతను మవునంగానే వున్నాడు.

ఇప్పుడు అతని ఆలోచనలన్నీ తన తల్లి చూట్టూ, అక్కచుట్టూ అల్లుకుపోయి వున్నాయి.

ఇదే దృశ్యం.....

ఆ రోజు తనను పోలీస్‌వ్యాన్‌లో జైలుకు తీసుకెల్తున్నప్పుడు గుండెలు పగిలేలా ఆక్రోశించిన తన తల్లి-

నేల మీద పొర్లి ఏడుస్తూ, పోలీసుల కాళ్ళు పట్టుకుని తన తమ్ముడిని వదిలేయమని ఘోషించిన తన అక్క.

అతని కళ్ళలో నీళ్ళు ఎప్పుడో కఠినమైన జైలు గోడలమధ్య ఇంకిపోయాయి. లేకుంటే అతనిలో ఇప్పుడు రేగుతున్న జ్ఞాపకాలు అతని
కనుల చివర తడిగా బయటపడేవి. అప్పుడామెకు అతను కొంతయినా అర్థమయి వుండేవాడు.

"నా దగ్గరకు వచ్చేముందు ఎవరితోనన్నా గొడవ పడ్డావా?" తిరిగి ప్రశ్నించిందామె.

"అప్పటికి నీ డ్యూటికి టైమ్ కాలేదు"

"అఫ్‌కోర్స్ జస్ట్.... క్యూరియాసిటీ, ఎందుకు? ఎవరికోసం?" ఆమె ఆసక్తిగా అతనికేసి చూస్తూ అడిగింది.

"నాకు ఎవరూ లేరు కనుక ఎవరికోసమో ఏదయినా చేయటానికి సిద్దంగా లేను. నా కోసమే చేసుకున్నాను".

"అంటే?"

ఆమెకు అర్థం కావటంలేదు అతను చెప్పేది.

"నేను బ్రతకాలి. బ్రతకాలంటే డబ్బు కావాలి, ఎవరో నలుగురు రౌడీలు ఆడపిల్లను

నడిరోడ్డుమీద అటకాయించారు. నేనది చూశాను. డబ్బిస్తానంటే రక్షిస్తానన్నాను. ఇస్తానంది. నా ఎనర్జీ ఖర్చుపెట్టి వాడ్ని చితకగొట్టాను. ఆమె దగ్గర 300 వసూలు చేసుకున్నాను. దట్సాల్" అతడు అది చాల క్యాజువల్‌గా చెప్పుకుపోతున్నాడు.

ఆమె బిత్తరపోయింది అతను చేప్పింది విని.

"నీ మాటలు, చూపులు, ప్రవర్తన చూస్తుంటే నువ్వో ఫిలాసఫర్ అనిపిస్తుంది. నీ చేతలు చూస్తుంటే వచ్చి మెటీరియలిస్ట్‌వనిపిస్తుంది. మొత్తానికి నిన్నర్థం చేసుకోవటం కష్టం".

"నన్నెవరు అర్థం చేసుకోనక్కరలేదు, చేసుకోలేరు. అలా చేసుకోకపోవటమే నాకిష్టం. నన్నెక్కువగా మాట్లాడించద్దు" అతను డిజ్‌గస్టింగ్‌గా అన్నాడు.

"ఏమవుతుంది మాట్లాడితే?"

"నా *జీతం* సరిపోదు."

"అంటే?"

"అంటే ఏముంది నేను నిన్ను రక్షించడానికి నీవిచ్చిన ఉద్యోగంలో చేరాను. అందులో నీతో మాట్లాడాలన్న నిబంధన లేదు".

ఆమె అర్థం కానట్లుగా చూసింది.

"అర్థం కాలేదూ? నాతో మాట్లాడాలంటే జీతం పెంచాల్సి వస్తుంది".

"మాట్లాడటానికి కూడానా"

"అవును. ఎక్కువగా మాట్లాడినా ఎనర్జి వేస్ట్ అవుతుంది, అందునా నువ్వు లొడ లొడా కామా, ఫుల్‌స్టాప్ లేకుండా మాట్లాడతావు".

ఆమె ఇబ్బందిగా ఫీలయ్యిందో క్షణం "నాకు కాళ్ళు నెప్పిగా వున్నాయి. రిక్షా గాని, ఆటోగాని ఎక్కుదామా?" ఆమెలో అతనిపట్ల ఆకర్షణ రెట్టింపవుతోంది. అందుకే అ చిలిపి ఆలోచన తట్టిందామెకు.

"ఎందుకు అనవసరంగా డబ్బు ఖర్చు"

"కాళ్ళు నొప్పెడుతున్నాయి" అందామె గోముగా అతనికేసి చూస్తూ.

"రిక్షా" అంటూ కేకేశాడు.

ఆమెకానందంగా వుంది. అతని ప్రక్కన కూర్చుంటే అతనిలో జడత్వం కొద్దిగానన్నా కరుగుతుందేమోనని ఆమెకు ఆశ.

రిక్షా వచ్చి పక్కన అగింది. ఉష రిక్షా ఎక్కి కూర్చుని ఉదయ్‌కేసి చూసింది ఎక్కమన్నట్లుగా.

"నా ఉద్యోగ నిబంధనలో నాకు రిక్షా, ఆటోలాంటి సౌకర్యాలు కల్పిస్తానని లేదు. నువ్విప్పుడు నన్ను కూడా రిక్షా ఎక్కమన్నావనుకో రిక్షా ఖర్చు ఎక్కువవుతుంది. నువ్వొక్కదానివే రిక్షా ఎక్కితే రెండు రూపాయలే. నేను కూడా ఎక్కితే నాలుగవుతుంది. నీ డబ్బు వృథా చేయడంకూడా నాకిష్టం లేదు" అంటూ రిక్షావాలాకేసి చూస్తూ "పదవోయ్"

అంటూ పెద్దపెద్ద అంగలువేస్తూ ముందుకు సాగాడు.

ఉదయ్ నడక, రిక్షా వేగం ఒకటే అయ్యాయి, ఆమెకేం చేయాలో కొద్దిక్షణాలు పాలు పోలేదు. ముందు అతను పైలెట్‌లా వెళ్ళుతుంటే తను వెనుక దర్జాగా రిక్షాలో వెళ్ళటం ఆమెకు మనస్కరించలేదు.

వెంటనే రిక్షా ఆపి అతనికి డబ్బులిచ్చేసి తిరిగి ఉదయ్ వెనుకే నడవటం ప్రారంభించింది.

ఆ తర్వాత ఇద్దరూ ఏం మాట్లాడుకోలేదు ఆఫీసు దగ్గరకు రాగానే అతను మెయిన్‌గేటు దగ్గరే ఆగిపోయాడు.

"ఈ రోజేమయినా బయటకు వెళ్ళే ప్రోగ్రామ్ వుందా?" అతను అడిగాడు ఆలోచిస్తూ.

"ఏం లేదు నీకు పనేదయినా వుందా? "ఆమె లోపలకు వెళ్ళేందుకు సిద్ధమవుతూ అడిగింది.

"నా పనులు తర్వాత. ముందు నీ భద్రతే ముఖ్యం కదా?"

"సాయంత్రం నాలుగుగంటలకు వస్తే చాలు. వెళ్ళనా మరి?"అందామె.

"ఓకే"అన్నాడు.

ఆమె లోపలకు వెళ్ళేవరకూ చూసి తను సర్కిల్‌ను కలిసేందుకు బయలుదేరాడు.

-----------------------------సమాప్తం-------------------------------------